# ముక్తి

- బలభద్రపాత్రుని రమణి

**'సర్వసంగ పరిత్యాగంలో కాదు నాకు విముక్తి లభించేది. అనంతకోటి అనురాగ బంధాలతో నేను స్వేచ్ఛని కౌగలించుకుంటాను' అన్నాడు రవీంద్రుడు.**

బిస్మిల్లాఖాన్నీ, గీతాంజలినీ, లత పాటనీ ఎవ్వరైనా విమర్శిస్తే నేను వాళ్ళని విచిత్రంగా చూస్తాను. అలా నేను కొంత మంది వైపే చూడాల్సి వచ్చింది. కానీ చాలా మంది మాత్రం నా వంక విచిత్రంగా చూస్తారు. కారణం నేను జీవించే పద్ధతి. ముప్పై ఏళ్ళు వచ్చినా నేను పెళ్ళి చేసుకోకపోవడం వాళ్ళకేదో నష్టం అన్నట్టుగా విచారించే హితైషులందర్నీ నేను దూరంగా ఉంచేశాను. దూరం నుండే నాకు సలహాలివ్వడానికీ, జ్ఞానబోధ చెయ్యడానికీ ప్రయత్నిస్తుంటారు.

నేను ఓ మాత్రం ఆఫీసర్ ఉద్యోగం వెలగ బెడ్తున్నాను. వయసు చిన్నదేం కాదు! నా మంచీ చెడూ నేను ఆలోచించుకోగలను... కానీ వాళ్ళంతా నా జీవితం ఏదో గాడి తప్పిపోతోందని ఎందుకు బాధపడిపోతారో నాకు అర్థంకాదు! నేను ఒక్కదాన్నీ సినిమాకి వెళ్ళడం, జైంట్‌వీల్ ఎక్కడం, నా వెహికిల్ ట్యాంక్‌బండ్ దగ్గర పార్క్ చేసి నిశ్చలంగా ఉన్న నీళ్ళ వంక చూస్తూ కాలం గడపడం వీళ్ళకేం నష్టం చేస్తాయో నాకు అర్థంకాదు. ఇవన్నీ ఓ ముప్పై ఏళ్ళ బ్యాచిలర్ చెయ్యడా? ఇంకా మందుకొడ్తాడూ... పేకాడ్తాడూ కూడా! అయినా ఎవరూ పట్టించుకోలేదు. 'వయసై పోతోంది... తొందరపడు. రేపు పెద్ద వయసులో నిన్ను ఎవరు చూస్తారు? నీకంటూ నీ కడుపున పుట్టిన బిడ్డలుండాలి' అని మగాడికి చెవిలో ఇల్లు కట్టుకుని ఇలాగే పోర్తారా?

ఆఫీస్ నుండి వస్తూ తెచ్చిన లిల్లీలని వాజ్‌లో అమర్చి, టవలూ, నైటీ తీసుకుని స్నానానికి వెళ్ళాను.

బయట నీలమ్మ ఎవరితోనో గట్టిగా మాట్లాడుతూ ఉండడం బాత్‌రూంలోకి వినపడ్తోంది.

''ఆ వసుంధరమ్మకి బుద్ధిరాదు. వచ్చి కళ్ళనీళ్ళెట్టుకుంటే చాలు అప్పో సప్పో చేసి డబ్బిచ్చేస్తుంది. అదే వాళ్ళకి అలుసైపోయింది. ఇట్లాంటి వాళ్ళని చూసే - పాపం కొర్దీ పురుషుడూ... కర్మం కొర్దీ బిడ్డలూ అన్నారు.''

''ముసలాయనకి ఒంట్లో బావుండలేదుట! ఆడబిడ్డ తీసుకొచ్చి దింపి 'మీ మావని నువ్వే చూసుకోవాలి తల్లీ' అని అప్పగింతలు పెట్టిపోయింది'' అంటోంది పక్కింటి సీతమ్మ.

నేను తల తుడుచుకుంటూ బాల్కనీలోకి వెళ్ళి ''నీలమ్మా'' అని పిలువకపోతే పక్కింటి సీతమ్మా, మా వంటావిడా అలాగే గోడకి అటూ ఇటూ నిలబడి రాత్రంతా మాట్లాడుకుంటూ వుండి పోతారనిపించింది.

''అమ్మా కాఫీ...'' అంటూ కప్పు అందించి వెళ్ళిపోకుండా అక్కడే నిలబడి ఏదో చెప్పాలన్నట్టు చూడసాగింది నీలమ్మ.

నేను ఆ రోజు వచ్చిన పోస్ట్ చూస్తూ ''ఊ... కానియ్యి.. మళ్ళీ వసుంధర గారి గురించేగా!'' అన్నాను.

నీలమ్మ వెంటనే అందుకుని ''ఔనమ్మా... వసుంధరమ్మ మొన్న బస్‌లోంచి దిగేటప్పుడు పడిందిట. కాలు ఇంతలావున వాచింది. సాయంత్రం చూద్దామని వెళ్ళాను. నేను వెళ్ళేసరికే పెద్ద పోట్లాట. పెద్ద కొడుకు ఎక్కడో చీటీవేసి ఆ డబ్బులు తీసుకుని, నెలనెలా కట్టకుండా ఎగ్గొట్టి పారిపోయాడ్ట. వాళ్ళు వచ్చి ఈవిడ ప్రాణం మీద కూర్చున్నారు. మెడలోంచి తాడు తీసి వాళ్ళకిచ్చి జమకట్టుకోమని ప్రాధేయపడ్తోంది'' అంది.

''ఇంకేం? సంపాదించి అప్పులు తీర్చే కల్పవృక్షంలాంటి తల్లి వుందిగా.. మళ్ళీ ఇంకో చోట అప్పు చేస్తాడూ!'' అన్నాను.

''అదేనమ్మా నా బాధంతా. పులిమీద పుట్రలా మంచం మీదున్న పక్షవాతం మావగార్ని తీసుకొచ్చి దింపిపోయారు. రెండో కూతురు మొగుడికి ఉద్యోగం పోయింది కాబట్టి నెలనెలా రెండు వేలు పంపమని ఉత్తరం వ్రాసిందిట! పంపకపోతే మరి వాళ్ళిద్దరూ ఏమైపోతారు పాపం? అంటుంది. ఇక పెద్ద కూతురు రోగం పేరుతో వారం వారం వచ్చి అందినంత గుంజుకెళ్తుంది. కడుపున పుట్టిన నలుగురివల్లా ఆ అమ్మకి సుఖం లేదు!'' అంది.

''నలుగురి పిల్లలకీ అంతో ఇంతో చదువు చెప్పించింది. వాళ్ళకి పెళ్ళిళ్ళు చేసింది. వాళ్ళ బాధ్యత ఇంకా ఈవిడది కాదు! వదిలించుకోవడం పెద్ద కష్టం కాదు! ఆ మొగుడే ఈవిడ్ని వదిలిపెట్టి పోయాకా ఇంకా ఆ మావగార్నీ, అత్తగార్నీ పట్టుకు వేళ్ళాడం, సేవలు చేయడం అనవసరం!'' కాస్త విసుగ్గా అన్నాను.

నీలమ్మ వెంటనే ''అద్గదీ! ఆ మాట వసుంధరమ్మతో ఓసారి చెప్పమ్మా. నువ్వంటే గౌరవం కదా... నీ మాట వింటుంది'' అంది.


నేను చిన్నగా నవ్వి ''రేపు ఆఫీసులో లంచ్ టైంలో చెప్పి చూస్తాలే!'' అన్నాను.

వయసులో నాకంటే చాలా పెద్దావిడైనా, ఆఫీసులో వసుంధర గారు నాకు సబార్డినేట్. రిటైర్మెంటుకి ఇంకో రెండు సంవత్సరాలుంది. తాతలనాడు కట్టి శిథిలమైపోయిన బంగాళా పెంకుల ఇంట్లో మా వీధి చివర్నే వుంటుంది. నేను బండి మీద వెళ్తూ ఎప్పుడైనా దార్లో కనిపిస్తే ఎక్కించుకుని తీసుకు వస్తాను. ఆఫీసులో కూడా పని విషయంగా ఆవిడ్ని పెద్దగా శ్రమ పెట్టను. నేను చూసినప్పుడల్లా ఎప్పుడూ ఏదో వెతుక్కుంటూ కనిపిస్తుంది. ఏదీ జ్ఞాపకం ఉండదనుకుంటాను. నెరిసిన తలతో, పాత నూలు చీరలో తురుష్కులు నాశనం చెయ్యగా మిగిలిన రామప్ప శిల్పంలా మన సంస్కృతిని ప్రతిబింబిస్తుంటుంది. హవాయి చెప్పుల్లోంచి ఆవిడ పసుపు రాసిన పాదాలు కనిపిస్తుంటాయి. పెద్ద కుంకుమ బొట్టుతో, నందివర్ధనమో, గన్నేరో గుచ్చుకుని ఏదో గొణుగుతూ ఉంటుంది. నెలకి పది రోజులు ఏదో ఒక కారణంతో లీవ్ పెడ్తుంది. ఒక రోజు పెద్ద కూతురికి ఎపెండిసైటిస్ ఆపరేషన్... ఇంకోసారి మనవడికి నీళ్ళ విరేచనాలు... మరోసారి మావగారికి సీరియస్సు! నేను ఒక్కోసారి మందలిస్తాను. చాలా సార్లు సరిపెట్టేసుకుంటాను.

ఆ రాత్రి నాకో కలొచ్చింది.

నేనూ, వసుంధరా చచ్చిపోయాం!

నా శవం పక్కన ఎవరూ లేరు! అంతా నిశబ్దం. కానీ వసుంధర శవం చుట్టూ కొడుకులూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అల్లుళ్ళూ, మనవలూ, మరుదులూ అందరూ చేరి పెద్ద పెద్దగా శోకాలు పెడ్తున్నారు.



నా ఆత్మ విరగబడి నవ్వుతూ ''మీరంతా ఏడుస్తున్నది వసుంధర మీద ప్రేమతో కాదు.. ఇక నుండీ కల్లబొల్లి ఏడుపులు ఏడ్చి డబ్బులు తీసుకుపోలేమే ... అని!'' అంది.

వసుంధర ఆత్మ వెంటనే ''నా పి.ఎఫ్, గ్రాట్యుటీ, అన్నీ సమానంగా పంచుకోండి'' అంది.

వాళ్ళంతా ఆమె శవాన్ని వదిలిపెట్టి 'నాకు ఎక్కువ' అంటే 'నాకు ఎక్కువ' అని పోట్లాడుకోసాగారు.


''చూశావా నీ వాళ్ళకోసం నీ జీవితం అంతా కర్పూరంలా కరిగించేశారు. వాళ్ళకి నీ మీద కాదు నీ డబ్బు మీదే ప్రేమ!'' కసిగా అంది నా ఆత్మ.

''ఇంకో రెండు సంవత్సరాలు నేను బ్రతికి వుంటే పెద్ద కొడుకు కొడుక్కి పాలిటెక్నిక్ చదువు పూర్తయ్యేది. వాడు సంసారాన్ని పోషించేవాడు. ఈ దేవుడికన్నీ తొందరే!'' అంది వసుంధర ఆత్మ.

''అప్పటికీ మృత్యుంజయ స్తోత్రం రోజూ చదువుతూనే ఉండే దానివిగా!'' పగలబడి నవ్వింది నా ఆత్మ.

''నేను లేకపోతే ఎంత మంది ఏడుస్తున్నారో చూడు! నీకోసం ఏడిచేది ఎవరూ?'' గర్వంగా అంది వసుంధర ఆత్మ.

ఔను! ఎవరూ రారేం? ఏడవరేం? నేను లేకపోతే చచ్చిపోతానన్న ప్రతాప్.. నా కోసం జీవితాంతం ఎదురు చూస్తానన్న కళాధర్... 'నేను మా అమ్మ బలవంతం మీద వేరొకర్ని చేసుకున్నా. ఎప్పటికీ నిన్నే ప్రేమిస్తుంటాను' అన్న భాస్కర్ బావా... అందరూ ఏమైపోయారూ?




నా ఆత్మ వాళ్ళని వెదకడం మొదలెట్టింది.

ప్రతాప్ తన భార్యతో సినిమా హాల్లో కనిపించాడు.

ఇంటర్వెల్‌లో ఓ స్నేహితుడు కలిసి నా మరణ వార్త అతని చెవిలో చెప్పాడు.

నా ఆత్మ పక్కనే నిలబడి అతని మొహంలో భావాలు గమనిస్తోంది.

అతను 'అయ్యో!' అన్నాడు. చేతిలోని కూల్‌డ్రింక్స్ వెనక్కిచ్చేసి బాధతో ఇంటికెళ్ళిపోతాడేమో అనుకున్నా! కానీ అతను కూల్‌డ్రింక్స్ తీసుకుని భార్య దగ్గరకి వెళ్ళాడు. ఆమెకి ఒకటి ఇచ్చి, ఆమె భుజంమీద చెయ్యి వేసి ఏదో జోక్ చేశాడు. ఆమె కిలకిలా నవ్వింది.

'ఇదేనా వీడి ప్రేమ? మంచిదైంది వీడిని పెళ్ళి చేసుకోలేదు' అనుకొని నా ఆత్మ అక్కడి నుంచి కళాధర్ ఇంటి వైపు సాగిపోయింది.

కళాధర్ ఏదో మీటింగ్‌లో ఉన్నాడు. యాష్‌ట్రే సిగరెట్ పీకలతో నిండిపోయి ఉంది! నా మరణవార్త టెలిగ్రాం రూపంలో అతన్ని చేరింది.

అతని ముఖంలో రంగులు మారాయి.

నాకు సంతోషం వేసింది.

అతను మిగతా మెంబర్స్ వైపు తిరిగి ''హైద్రాబాద్‌లో మనకు మార్కెటింగ్ కండీషన్స్ చెప్పే మనిషి ఇప్పుడు లేదు. ఎవరైనా బాగా తెలిసిన వాళ్ళుంటే చూడండి! ఈ సంవత్సరం అక్కడ మన బ్రాంచ్ ఓపెన్ చెయ్యాలనుకున్నాం. ఛీ... ఛీ... కొన్నాళ్ళు ఆగితే ఏమయ్యేదిట? చెప్పా చెయ్యకుండా పోయింది. అన్నీ ఇలాంటి పనులే మిడిమేలపు మనిషి'' అని విసుక్కున్నాడు.

'ఓ! నా బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్స్ నీకు ఉపయోగపడ్తుందని ఇన్నాళ్ళూ నాతో స్నేహం నటించావా? మా నాయనే!' అనుకుని విరక్తిగా అక్కడి నుండి నా ఆత్మ ఎగిరి భాస్కర్ బావ ఇంటి మీద వాలింది.

''విన్నావా? నీ మరదలు పోయిందిట!'' అన్నాడెవడో స్నేహితుడు.

''అదే నా బాధ!'' అన్నాడు భాస్కర్.

నా ఆత్మ సంతోషంతో ఎగిరిగెంతులేసింది.

''దాన్ని చేసుకునుంటే బోలెడు డబ్బొచ్చేది. ఇన్స్యూరెన్స్ అవీ భారీగానే చేసుంటుంది. ఛ! అవన్నీ ఇప్పుడు ఎవరి పాలౌతాయో! బతికినా చచ్చినా సంపాదించే పెళ్ళాం అయితే బోలెడు లాభం!'' సీసా ఎత్తుకుని మరీ తాగుతూ చెప్పాడు.

నా ఆత్మ ఈసారి మరీ సంతోషపడింది. మంచిదైంది నేను వీళ్ళెవర్నీ నమ్మి పెళ్ళి చేసుకోలేదు.

పనికిమాలిన వెధవలు! ప్రతివాడూ నా డబ్బు కోసం తప్ప నన్ను నన్నుగా ప్రేమించలేదు. గాల్లో గిరికీలు కొడ్తూ 'హహహ్హా.. హహహ్హా...' అని నవ్వుతుంటే మెలుకువ వచ్చేసింది!

నాకు వచ్చింది పీడకలా, మంచికలా? ఏమో! పగలు మనసు పేటికలో బంధించి పెట్టిన ఆలోచనలన్నీ రాత్రిళ్ళు మూత తెరుచుకుని కలల రూపంలో వచ్చి మస్తిష్కాన్ని గజిబిజి చేసి పోతుంటాయి! బహుశా ఈ ఆలోచించడమే మనిషిని జంతువులా కాకుండా కాపాడ్తోందనుకుంటా!

కాసిని మంచినీళ్ళు తాగి మళ్ళీ పడుకున్నాను.

000

''లంచ్ చేశారా?'' చిరునవ్వు తెచ్చుకుని వసుంధరని అడిగాను.

''ఈ రోజు శనివారం. ఏమీ తినను'' అంది కొంగునిండా కప్పుకుంటూ.

ఎవరితోనైనా మన పర్సనల్ ప్రాబ్లెమ్స్ మాట్లాడడం తేలిక. వాళ్ళ ప్రాబ్లెమ్స్ గురించి ప్రస్తావించడం ఇబ్బందైన సంగతి!

నేను గొంతు సవరించుకుని ''కుంటుతూ నడుస్తున్నారే! ఏమైనా దెబ్బ తగిలిందా?'' అన్నాను.

''లేదు. చెప్పు తెగింది వస్తూ ఉంటే!'' అంది.

మానసిక విశ్లేషణ ప్రారంభిస్తే... ఆమె టాపిక్ క్లోజ్ చేసేసింది. కొనసాగించే మార్గం నాకు మిగల్చలేదు.

నేను ఓసారి నా గ్లాసెస్ కళ్ళ నుండి తీసి తుడిచి మళ్ళీ పెట్టుకొని, ఇంకో తలుపు తెరవడానికి ట్రై చేశాను.

''పిల్లల పెళ్ళిళ్ళవీ అయి బాధ్యతలన్నీ తీరిపోయాయనుకుంటాను. రిటైరయ్యాక పీస్‌ఫుల్‌గా లైఫ్ లీడ్ చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నారా?''

వసుంధర నా కళ్ళల్లోకి చూసింది. ఆ తర్వాత తల వంచుకుని ''మీ తల్లిదండ్రులకి ఎంత మంది సంతానం?'' అంది.

''ముగ్గురం. మా అన్నయ్యకీ, చెల్లెలికీ పెళ్ళిళ్ళయి సెటిలయ్యారు. నేనిలా సెటిలయ్యాను'' అన్నాను.

''మీ ఉద్దేశం ప్రకారం వాళ్ళకి ఇంకా మీ బాధ్యత ఉన్నట్టేగా!'' అంది.

''నా బాధ్యతా?'' నాకు నవ్వొచ్చింది.

అన్నయ్యకీ, అమ్మా నాన్నలకీ ప్రతి అవసరానికీ ఆర్థికంగా సాయపడేది నేను. చెల్లెలు కూడా నా మీద ఆధారపడ్తూనే ఉంటుంది. వాళ్ళ బాధ్యతలు నా మీద వెయ్యాలనే చూస్తారు కానీ నా గురించేం వాళ్ళకి బాధలు లేవు. ఆ సంగతే ఆవిడతో చెప్పాను.

వసుంధర జ్ఞానిలా నవ్వింది. ''చూశారా! పెళ్ళి అవడం, కాకపోవడం వల్ల బాధ్యతలు తీరవు. అసలు బాధ్యతలకీ పిల్లల పెళ్ళిళ్ళకీ సంబంధం లేదు.''

నన్ను కార్నర్ చేసిన ఆవిడ తెలివి తేటలకి నాకు ఆశ్చర్యం వేసింది. అయినా పట్టు విడవకుండా ''రెక్కలొచ్చేదాకానే తల్లి పక్షి పిల్లల్ని కాపాడ్తుంది. ఆ తర్వాత వదిలిపెట్టేయాలి. లేకపోతే అవి ఎప్పటికీ వాటి ఆహారం అవి సంపాదించుకోవడం నేర్చుకోవు'' అన్నాను.

''ఆ తర్వాత కూడా పట్టించుకుని వాటిగురిం

చి మదనపడేంత మెదడు భగవంతుడు వాటికి ఇవ్వలేదు. మనుషులకి అలా కాదు కదా!'' అంది.

ఏదైనా డొంకతిరుగుడుగా ఇంత సేపు మాట్లాడడం నాకు వ్యర్థం అనిపించింది.

''మీ మాటల్ని బట్టి చూస్తే మీరింకా మీ పిల్లల బాధ్యతలన్నీ నెత్తిన వేసుకుని కష్టపడ్తున్నట్టుగా నాకు తోస్తోంది! పెద్ద వయసులో వాళ్ళు మీకు ఆసరా కావాలి కానీ ఇంకా మీరే వాళ్ళకి సర్వం సమకూర్చి పెట్టటం ఏమిటీ? మీరు అందిన ప్రతి లోనూ తీశారు. మనకి పెన్షన్ స్కీము కూడా లేదు. రేపు వచ్చే ఆ స్వల్ప మొత్తంలో మీ జీవితం ఎలా గడుస్తుందీ? ఈ విషయాలు ఎప్పుడైనా ఆలోచించారా? ఇప్పుడు వాళ్ళ జీవితాలు వాళ్ళు గడపలేక ఆర్థికంగా మీ మీద ఆధారపడ్తున్న మీ పిల్లలు, రేపు ముసలితనంలో మిమ్మల్ని చూస్తారనుకుంటున్నారా?'' కొద్దిగా స్వరం పెంచి తీవ్రంగా అడిగాను.

అంతా విని వసుంధర అదే ప్రసన్న వదనంతో ''మీకూ పిల్లలుంటే ఎందుకు చేస్తున్నానో అర్థం అయ్యేది! ఇప్పుడు నేను వివరించినా మీకు మూర్ఖంగా అనిపిస్తుంది'' అంది.

నేను మాట్లాడలేని విధంగా నన్ను దెబ్బ కొట్టింది అనిపించింది.

''మీ పెద్దమ్మాయి కడుపు నెప్పితో గింగిరాలు తిరుగుతుంటే వెంటనే ఆపరేషన్ చేయించకుండా ... ఆ ఆరు వేలకీ రేపు రిటైరయ్యాకా వడ్డీ వస్తుందిగా ఎందుకు ఖర్చు పెట్టాలీ? అని మీరు ఆలోచించగలరా? మీ రెండో వాడిని అప్పుల వాళ్ళు రక్తం వచ్చేట్లు కొట్టి, ప్రాణం తీస్తామని బెదిరిస్తే... కళ్ళు మూసుకుని నాకెందుకులే అని కూర్చోగలరా? మీరిక్కడ కడుపునిండా తింటూ అక్కడ పసికందులైన మీ మనవలు ఆకలితో ఏడుస్తుంటే తలుచుకోకుండా నిశ్చింతగా ఉండగలరా? మీ కళ్ళ ముందే మీ రెండో కూతుర్ని మొగుడు డబ్బు తీసుకు రమ్మని బెల్టుతో గొడ్డుని బాదినట్టు బాదుతుంటే తల తాకట్టు పెట్టైనా ఆ డబ్బిచ్చి పిల్లకి ఆ యమచెర తప్పించాలనుకోరా? 'నువ్వు తప్ప నాకు గతిలేదు' అంటూ గుమ్మంలోకి వచ్చిన వృద్ధుడ్ని నీ కొడుకూ, అతడి వల్ల లభ్యమయ్యే సుఖాలూ నీకు లేవు కనుక.. పో... పోయి నాలుగిళ్ళలో ముష్టెత్తుకు బతుకు ... లేధా ఎందులోనైనా దూకి చావు... అని మీరనగలరా? నేను అనలేను'' అని లేచి నిలబడింది.

ఇవన్నీ ఆమె చాలా ప్రసన్నంగానే చెప్పింది. ప్రతి ఉదయం సూర్యాస్తమయం ఎంత సహజమో తనిలా ప్రవర్తించడం అంతే సహజం అన్నట్టుగా చెప్పి నిలబడింది.

''మీరు వెళ్ళి పని చూసుకోండి'' అన్నాను.

ఆమె మాటల్లో సెల్ఫ్ సింపతీ లేదు. ఇలా నా మీద పడి పీక్కుతింటున్నారు ఏం చెయ్యనూ! అనే కంప్లెంట్ లేదు! రేపటి గురించి ఏం ఆలోచించారూ? అనే ప్రశ్నకి ముసలాయన ఉదాహరణ చెప్పింది. అంటే... ఏ కొడుకైనా చూస్తే సరే... లేదా ఎందులోనైనా దూకి చస్తుందన్న మాట! అసలు ప్రోబ్లమే లేదన్నట్టుగా ఆమె మాట్లాడాకా, సొల్యూషన్ గురించి నేను మాట్లాడడం వేస్ట్ అనిపించింది.

ఈ సంఘటన తర్వాత నాకు వసుంధర క్యారెక్టర్ మీద ఇంట్రెస్ట్ పెరిగింది. కానీ ఆమెని గమనించడం మాత్రం వైదేహి వచ్చి వెళ్ళిన తర్వాతే ప్రారంభించాను.

వైదేహి మా పిన్నికూతురు.

ఫోన్‌లో ''అక్కా... నా సమస్యలు ఒకటా, రెండా ..., ఎన్నని నీతో చెప్పను? ఎందుకైనా మంచిది ఒకసారి వచ్చి నీతో చెప్తేనే మంచిదిలే, రేపు వస్తున్నాను'' అని గుంటూరు నుండి ఫోన్‌చేసింది.

సాధారణంగా నా బంధువులు హైద్రాబాద్ ఎవరొచ్చినా కోర్టు పనులుండో, లేక స్టార్ హాస్పిటల్స్‌లో చెకప్ కోసమో, పెళ్ళి సంబంధాల కోసమో వస్తారు. అవన్నీ నాకు పట్టవు. నేను మామూలుగా ఆఫీసుకొచ్చేస్తాను.

అమ్మా, నాన్నా అయితే ''మేం అంతదూరం నుండి వచ్చినా ఒక్క పూట కూడా ఇంట్లో ఉండవేమిటే?'' అని సాధిస్తారు.

ఇంట్లో వుండి వాళ్ళ సస భరించడం కన్నా ఆఫీసుకెళ్ళడమే నాకు ఉత్తమంగా అనిపిస్తుంది. నేను పెళ్ళి చేసుకోకుండా వాళ్ళ భాషలో 'మోడు'లా వుండిపోవడం వాళ్ళకి ఎంత మనస్తాపంగా వుందో రకరకాలుగా వర్ణించి చెప్తుంటారు! అమ్మైతే మాటకి ముందు కంటతడి పెడ్తుంది. అసలు ప్రొబ్లమ్స్ అంటే ఎలా ఉంటాయో, వీళ్ళకి తెలీకపోవడమే వీళ్ళ ప్రొబ్లెమ్ అనిపిస్తుంది నాకు!

కానీ... వైదేహి వస్తోందని నేను రెండు రోజులు లీవ్ పెట్టాను. మా మధ్య బంధుత్వం కన్నా స్నేహమే ఎక్కువ!

౦౦౦

టీ సిప్ చేస్తూ ''నీది బాదరబందీ లేని జీవితం. హాయిగా ఉన్నావు. పెళ్ళి చేసుకుని నేను ఎన్నెన్ని బాధలు పడ్తున్నానో నీకు తెలీదు!'' అంది వైదేహి.

''అదేవిటే? శశాంక్‌ని ప్రేమించి మరీ పెళ్ళి చేసుకున్నావుగా. అతనూ నిన్ను చాలా బాగా చూసుకుంటాడని విన్నానే!'' అన్నాను.

''శశాంక్‌వల్ల నాకే బాధా లేదు. అంతా అతని వాళ్ళవల్లే!'' దిగులుగా చెప్పింది.

'అత్తగారూ ఆడబిడ్డలూ కష్టాలు పెడ్తున్నారా?' అడిగాను.

''కష్టాలని చెప్పలేనుగానీ తెగ సమస్యలు లేవనెత్తుతారు. ఈయన ఒక్కడే కొడుకు అవడంతో ఏదొచ్చినా ఈయన మీద పడిపోతారు. అమ్మయ్యా... ఈ పూట ఒక్క ఫోన్‌కాల్ కూడా రాలేదు. వాళ్ళ గురించి ఆలోచించాల్సిన పని లేదు అనుకోడానికి లేకుండా వుంది. ఆరేళ్ళు నోరు మూసుకుని పడి ఉన్నాను. ఇంక నా వల్ల కాలేదు. తేగేసి చెప్పాను. మీ వాళ్ళతో సంబంధ బాంధవ్యాలు తగ్గించుకో లేదా వాళ్ళతోనే ఉండి నన్ను వదులుకో... అని!'' అంది.

''ఫోన్ చేసి ఏవంటారూ? డబ్బు అడుగుతారా?'' అన్నాను.

''డబ్బుకన్నా విలువైనది... ఆయన ఎటెన్షన్ తమ వైపుకి లాగేస్తారు. అత్త గారికి ఆ పూట బీ.పీ కాస్త రైజ్ అయినా, పెద్దాడబిడ్డ కొడుక్కి ఎంసెట్‌లో ర్యాంక్ వచ్చినా, రెండో ఆవిడ కూతురికి నెల తప్పినా, మా మామగారికి బంధువుల గూర్చి ఏదైనా కొత్త విషయం తెలిసినా వెంటనే ఈయనకి ఫోన్‌చేసి గంటల సేపు మాట్లాడాల్సిందే! అన్నింటికీ మేనమామా, మేనత్తా ముందుండాలి అని బాధ్యతలు మా నెత్తిన వేస్తారు. అసలు ఈయన్ని అడక్కుండా ఆ బామార్లు కూడా ఏ పనీ చెయ్యరు. చాలా విచిత్రమైన మనుషులు!'' అంది.

''వాళ్ళందరితో ప్రేమగా మాట్లాడి, నీ మీద విసుగు చూపిస్తాడా శశాంక్?'' అని అడిగాను.

''అబ్బే! ఆయనకున్నంత ఓపిక ఎవరికీ వుండదు. నన్నూ విసుక్కోరు. నేనేం అన్నా అసలు పట్టించుకోరు!''

''మరి ఇంకేం?''

''అదే నా బాధ! నేను ఇవన్నీ వదిలిపెట్టి మన కుటుంబం, మన ఆనందం వీటికి ఎక్కువ టైం కేటాయించండీ అంటే పట్టించుకోరు! వాళ్ళవాళ్ళ మీద ఆయనకి చచ్చేంత ప్రేమ!'' అక్కసుగా అంది.

''అందులో ఆయనకి సంతోషం వుందేమో!'' అన్నాను.

''ఎందుకుండాలీ? పెళ్ళయ్యాక భార్యా పిల్లలూ తోడిదే లోకంలా వుండాలిగా! ఎవరైనా ఇలా అక్కల పిల్లల గురించీ, తల్లిదండ్రుల గురించీ నిత్యం ఆలోచిస్తున్నారా? వాళ్ళ ఇళ్ళల్లో ఏం వచ్చినా పెళ్ళాంతో సహా హాజరవుతున్నారా? మా అన్నయ్యలు ఇలాగే చేస్తున్నారా? ఇంట్లో వున్న అమ్మా నాన్ననే పలకరించడం చాలా అరుదు!'' అంది.

(సశేషం)